సాక్షి మహబూబాబాద్

మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



టోల్‌గేట్ చార్జీల్లో మార్పులు

కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులపై ఏర్పాటు చేసిన టోల్‌గేట్ల వద్ద సోమవారం అర్ధరాత్రి నుంచి చార్జీల్లో మార్పులు చేసింది.

- 8లో▸



జోరుగా రిజిస్ట్రేషన్లు..

ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపులో భాగంగా సోమవారం రంజాన్ పండుగ రోజు కూడా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దస్తావేజుల రిజిస్ట్రేషన్ల జోరు కొనసాగింది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
40.0^0 / 22.4^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ కాస్త మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అర్హులు దరఖాస్తు చేసుకునేలా చూడాలి

- వీసీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



మహబూబాబాద్: రాజీవ్ యువ వికాసం పథకానికి ఎక్కువ మంది అర్హులు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి రాజీవ్ యువవికాసం పథకంపై జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. రాష్ట్రంలో ఐదు లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువత ఆర్థికంగా ఎదిగేందుకు రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలుతో రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తగ్గుతుందన్నారు. రుణం మాఫీ విధానంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత మున్సిపల్ పరిధి అయితే మున్సిపాలిటీ కార్యాలయంలో.. మండల స్థాయిలో అయితే ఎంపీడీఓ కార్యాలయంలో పత్రాలు అందజేయాలన్నారు. వీసీలో జిల్లా నుంచి కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

మార్వాడీల 'ఘన్‌గోర్' ఊరేగింపు



మహబూబాబాద్ రూరల్: మార్వాడీలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఘన్‌గోర్ వేడుకల్లో భాగంగా శివపార్వతుల స్వరూపమైన గోరా, ఈసర్ (ఘన్‌గోర్) కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ మానుకోట పట్టణ వీధుల్లో ఘన్‌గోర్‌ల విగ్రహాలను ఊరేగించారు. వాటిని మహేశ్వరీభవన్‌లోని రాధాకృష్ణుల సన్నిధిలో ఏర్పాటు చేసి మార్వాడీ మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హారతులిచ్చి, నైవేద్యాలు సమర్పించి పూజలు ఆచరించారు. ఈ పూజలతో వివాహం కానివారికి జరుగుతుందని, మహిళలు సుమంగళిగా ఉండేందుకు భగవంతుడు అనుగ్రహిస్తాడని తెలిపారు. భక్తులు ఉపవాసం ఉండి పూజలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సఖీ మండలి సభ్యులు చిన్నారులతో నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. సంగీత్ విభావరిలో మహిళలు భక్తి గేయాలు ఆలపించారు.

వేయిస్తంభాల ఆలయంలో సీతారాములకు పూజలు



హన్మకొండ కల్చరల్: శ్రీరామనవమి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా రుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో సోమవారం రెండోరోజూ సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో శ్రీరుద్రేశ్వరుడికి రుద్రాభిషేకం, 121 మంది దంపతులు సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. తెలుగు సంవత్సరాది ప్రారంభం, శివ ప్రీతికరమైన సోమవారం కావడంతో అధికసంఖ్యలో భక్తులు దేవాలయాన్ని సందర్శించారు. కృష్ణయజుర్వేద పండితుడు గుదిమెల్ల విజయకుమారాచార్యులు ఆధ్వర్యంలో సీతారాముల ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించి అనుష్ఠాన పూజలు, యాగశాలలో మహా సుదర్శనహోమం జరిపారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ అనిల్‌కుమార్, సిబ్బంది పర్యవేక్షించారు.

భద్రకాళి అమ్మవారికి పుష్పార్చన



హన్మకొండ కల్చరల్: వసంత నవరాత్ర ఉత్సవాల్లో భద్రకాళి దేవాలయంలో సోమవారం అమ్మవారికి పుష్పార్చన చేశారు. ఉదయం అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అమ్మవారికి నిర్మాల్యసేవలు, నిత్యాహ్నికం నిర్వహించారు. అనంతరం వేదపండితులు, వేదపాఠశాల విద్యార్థులు తెల్లచామంతి పూలకు సంప్రోక్షణ చేసి అమ్మవారికి లక్షపుష్పార్చన నిర్వహించారు.

ఘనంగా ఈద్-ఉల్-ఫితర్

- జిల్లా వ్యాప్తంగా రంజాన్ వేడుకలు



రంజాన్ సందేశమిస్తున్న మత పెద్ద



మహబూబాబాద్ రూరల్: జిల్లాలో ముస్లింలు రంజాన్(ఈద్-ఉల్-ఫితర్) వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మానుకోట పట్టణంలోని కొత్త, పాత బజార్లలోని ఈద్గా మైదానాల్లో జరిగిన రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు వేలాదిగా పాల్గొని న మాజ్ చేశారు. ముస్లిం మతపెద్దలు మహ్మద్ అబ్దుల్ హమీద్, మౌలానా మహ్మద్ సయీద్ అహ్మద్‌రిజ్వీ రంజాన్ విశిష్టత, అల్లా అనుగ్రహంపై సందేశమిచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఖబరస్థాన్‌కు వెళ్లి తమ ఇళ్లలో మృతి చెందిన పెద్దల సమాధుల వద్ద ముస్లింలు నివాళులర్పించారు. కాగా, ఎమ్మెల్సీ రవీందర్‌రావు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు సిబ్బంది పటిష్ఠ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

- మరిన్ని ఫొటోలు 9లో▸



కొత్త బజార్ ఈద్గా మైదానంలో రంజాన్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఒక్కొక్కరుగా..

నేలకొరుగుతున్న ఓరుగల్లు మావోయిస్టు నేతలు

- సమసమాజ స్థాపనకు అడవిబాట
- దండకారణ్య ఉద్యమ నాయకత్వంలో ఉమ్మడి జిల్లావారే కీలకం
- వారం రోజుల వ్యవధిలో ఇద్దరు కీలకనేతల మృతి
- 'కగార్' నేపథ్యంలో ఆందోళనలో మావోయిస్టుల కుటుంబాలు
- 'మోస్ట్ వాంటెడ్' జాబితాలో ఉమ్మడి జిల్లా నుంచి మరో 21 మంది..

సాక్షిప్రతినిధి, వరంగల్:

సమసమాజ స్థాపనకు తుపాకీనే మార్గమని భావించి ఇల్లు, కుటుంబాన్ని విడిచి అడవి బాట పట్టారు. విప్లవమే శ్వాసగా ఆటుపోట్లను ఎదుర్కొంటూ అజ్ఞాతజీవితం గడిపారు. ఈ క్రమంలో దండకారణ్యంలో ఇటీవల మోగుతున్న తుపాకుల మోతకు ఒక్కొక్కరుగా బలవుతున్నారు. ఏళ్లకు ఏళ్లుగా ఏమయ్యారో తెలియని కుటుంబ సభ్యులు చివరికి మృతదేహాలను చూసి బోరున విలపిస్తున్నారు. 'ఆపరేషన్ కగార్' నేపథ్యంలో ఎన్‌కౌంటర్ ఘటనలు ఓరుగల్లు మావోయిస్టుల కుటుంబాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు అడవుల్లో ఎక్కడ కాల్పుల సంఘటనలు జరిగినా.. ఇక్కడ కలకలం రేపుతున్నాయి. ఈ మధ్యకాలంలో ఎదురుకాల్పుల ఘటనల్లో పదుల సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందుతుండగా.. అందులో కీలకనేతలు ఉమ్మడి వరంగల్‌కు చెందిన వారే ఉంటుండటం చర్చనీయాంశం అవుతోంది. 10 నుంచి సుమారు 35 సంవత్సరాల పాటు దండకారణ్యంలో మావోయిస్టు కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారు.. దళ సభ్యుడి నుంచి కేంద్ర కమిటీ వరకు ఎదిగి హతమవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కరోనా సమయంలో కేంద్ర కమిటీ సభ్యుడు కత్తి మోహన్‌రావు, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ లాంటి నేతలు అనారోగ్యంతో మృతి చెందగా.. గత ఏడాదికాలంలో పలువురు మావోయిస్టు పార్టీ కీలక నేతలు పోలీసు బలగాలతో జరిగిన కాల్పుల్లో కన్నుమూయడం చర్చనీయాంశంగా మారింది.

ఉమ్మడి వరంగల్ నుంచి 21 మంది..

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, జార్ఖండ్ తదితర 11 రాష్ట్రాల్లో పనిచేస్తున్న మావోయిస్టు పార్టీ అగ్రనేతల వివరాలపై కేంద్ర హోంశాఖ ఈ ఏడాది జనవరిలో ఆరా తీసింది. తెలంగాణలోని పాత 10 జిల్లాల నుంచి 64 మంది ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల్లో పనిచేస్తున్నట్లు తేలిందని వెల్లడించింది. ఇందులో అత్యధికంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 24 మంది అజ్ఞాతంలో ఉన్నట్లు ప్రకటించింది. ఇందులో కోడి మంజుల లొంగిపోగా, ఇటీవల ఎన్‌కౌంటర్‌లో సారయ్య, తాజాగా రేణుక చనిపోయారు. ఇంకా 21 మంది ఉన్నారు. వీరిలో కేంద్ర కమిటీతోపాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, దండకారణ్యం కమిటీల్లో కీలకంగా ఉన్న మోడెం బాలకృష్ణ అలియాస్ మహేశ్, బాబన్న, గాజర్ల రవి అలియాస్ గణేశ్, బడే దామోదర్ అలియాస్ చొక్కారావు, గాదె రాజు, సుంకరి రాజ్, గీరెడ్డి పవనానందరెడ్డి అలియాస్ అర్జున్, ఉల్లెంగుల యాకయ్య అలియాస్ అంజన్న, పసునూరి నరహరి అలియాస్ సంతోష్, ముప్పిడి సాంబయ్య అలియాస్ బాబన్నతో పాటు మరికొంత మంది ఉన్నారు.

ఎన్‌కౌంటర్లలో ఉమ్మడి జిల్లా నేతలు



సుధాకర్ (ఫైల్)

జేఎస్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం అంకుశాపూర్‌కు చెందిన అన్నె సంతోష్ అలియాస్ సాగర్ 2024 ఏప్రిల్ 6న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉసూర్ బ్లాక్‌ర పూజారి కాంకేర్ సమీపం కర్రిగుట్ట అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. సుమారు 26 ఏళ్లకు పైగా దండకారణ్యంలో పని చేస్తున్న సంతోష్.. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతూ ఎన్‌కౌంటర్‌లో ఆసువులు బాశారు.



ఏసోబు (ఫైల్)

2024 ఏప్రిల్ 16న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు మృతి చెందగా.. అందులో జయశంకర్‌భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగెకు చెందిన సిరిపల్లె సుధాకర్ అలియాస్ శంకర్‌రావు, అతడి భార్య సుమన అలియాస్ రజిత ఉన్నారు. సుధాకర్ దండకారణ్య డివిజన్ కమిటీ ఇన్‌చార్జ్ కాగా, ఆయన భార్య డీసీఎస్ స్థాయిలో పనిచేసింది.



అన్నె సంతోష్ (ఫైల్)

2024 జూన్ 24న తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దు దామెరతోగు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నల్లమారి అశోక్ అనే మావోయిస్టు మృతిచెందాడు. జేఎస్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం తిమ్మాపురానికి చెందిన అశోక్.. వరంగల్, ఖమ్మం సరిహద్దు అటవీ ప్రాంత ఇన్‌చార్జ్‌గా పనిచేస్తూ హతమయ్యాడు.



సారయ్య (ఫైల్)

మావోయిస్టు పార్టీ తొలితరం నేత, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఓరుగల్లు విప్లవ వీరుడు మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ 2024 సెప్టెంబర్ 4న ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఛత్తీస్‌గఢ్ ప్రజలకు జగన్‌గా, రణదేవ్ దాదాగా సుపరిచితమైన ఆయన దంతెవాడ, బీజాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో హతమయ్యాడు. ఆయన 50 ఏళ్ల ఉద్యమ ప్రస్థానానికి తెరపడింది. ఆయన స్వగ్రామం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెం.



రేణుక (ఫైల్)

2025 మార్చి 25న మావోయిస్టు కీలకనేత అంకేశ్వరపు సారయ్య అలియాస్ సుధీర్, సుధాకర్ దంతెవాడ జిల్లా బీజాపూర్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. ఆయనది హనుమకొండ జిల్లా మడికొండ పీఎస్ పరిధిలోని తరాలపల్లి. సుమారు 35 ఏళ్ల కిందట మావోయిస్టు పార్టీ ఉద్యమంలో అంచెలంచెలుగా దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడిగా ఎదిగాడు.

ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో సోమవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జడ్‌సీ), ప్రెస్‌టీమ్ ఇన్‌చార్జ్‌గా గుమ్ముడవెల్లి రేణుక మృతి చెందింది. ఆమెది జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామం. ఈమెపై మొత్తం రూ.45లక్షల రివార్డు ఉంది. మూడు దశాబ్దాల ఉద్యమ ప్రస్థానం ముగిసింది.



ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన గుమ్ముడవెల్లి రేణుక నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, మందుగుండు సామగ్రి, ల్యాప్‌టాప్, సాహిత్యం

ముగిసిన 'కడవెండి' మావోయిస్టు ప్రస్థానం

వివిధ ఎన్‌కౌంటర్లలో నేలరాలిన నలుగురు నక్సల్స్ వెంకటరమణ, సంతోష్‌రెడ్డి, శ్రీను, రేణుక


- సీపీఐ(ఎంఎల్) నక్సల్స్ విస్తరణకు పునాదులు ఇక్కడే..
- మూగబోయిన విప్లవోద్యమాల పురిటి కెరటం
- ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో అసువులుబాసిన గుమ్ముడవెల్లి రేణుక
- కడవెండిలోనే తుది వీడ్కోలుకు సన్నాహాలు.. పరిశీలించిన పోలీసులు

- వివరాలు 8లో▸

- దేవరుప్పుల

ఎల్‌ఆర్‌ఎస్.. 22శాతమే

- ముగిసిన రాయితీ గడువు
- మళ్లీ అవకాశం వస్తుందనే నమ్మకం
- ప్రభుత్వ నిర్ణయమే తరువాయి



సాక్షి, మహబూబాబాద్: ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం కల్పించిన 25శాతం రాయితీ గడువు మార్చి 31తో ముగిసింది. అయితే ఈ వెసులుబాటుతో పెద్ద మొత్తంలో ఇంటి స్థలాల యజమానులు తరలివస్తారని, వారు చెల్లించే ఫీజులతో ప్రభుత్వానికి భారీ మొత్తంలో ఆదాయం వస్తుందని భావించినా.. లక్ష్యం మాత్రం నెరవేరలేదు. మొత్తం 22 శాతం మందే తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఫీజులు చెల్లించారు. మిగిలిన వారిలో కొందరు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నా.. సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో మరోసారి అవకాశం వస్తుందని ఎదురుచూస్తున్నారు.

22శాతం చెల్లింపు

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 25శాతం రాయితీ కల్పించి నెలరోజుల గడువు ఇచ్చారు. కాగా 2020 డిసెంబర్ 31 వరకు రూ.1,000 చెల్లించి రశీదు తీసుకున్న వారికే ఈ అవకాశం ఉంది. అయితే ఇందులో మహబూబాబాద్, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్ మున్సిపాలిటీల పరిధిలో 26,001 మంది రూ.1,000 చెల్లించి రశీదు తీసుకున్నారు. కాగా ఇందులో ప్రభుత్వ నిబంధనల మేరకు నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 17,550 దరఖాస్తులు ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించుకునేందుకు అర్హత ఉందని అధికారులు చెప్పారు. దీంతో పై నాలుగు మున్సిపాలిటీలతోపాటు కొత్తగా ఏర్పడిన కేసముద్రం మున్సిపాలిటీలోని 942 దరఖాస్తులు కలుపుకొని మొత్తం 18,492 మంది భూ యజమానులకు ఆయా మున్సిపాలిటీల్లోని ఉద్యోగులు ఫోన్ల ద్వారా, ఫ్లెక్సీలు పెట్టి అవగాహన కల్పించారు. దీంతో ఐదు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 4,085 ప్లాట్లకు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించారు. అంటే మొత్తం దరఖాస్తుల్లో 22.09శాతం మంది ప్రభుత్వం కల్పించిన 25శాతం రాయితీని సద్వినియోగం చేసుకున్నట్లు స్పష్టమవుతోంది. కాగా అధిక సంఖ్యలో ఆసక్తి చూపలేదని దీనిని బట్టి తెలుస్తోంది.

మళ్లీ అవకాశం కోసం ఎదురుచూపు..

గతంలో రూ.1,000 చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసిన వారితోపాటు.. కొత్తగా ప్లాట్లు కొనుగోలు చేసిన వారు తెలంగాణ ప్రభుత్వం మరోసారి అవకాశం ఇస్తుందని ఎదురుచూస్తున్నారు. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం బఫర్ జోన్, చెరువులు, కుంటలు, ఇతర ప్రభుత్వ స్థలాలు, హోల్డ్‌లో పెట్టినవి, కోర్టుకేసులో ఉన్న ప్లాట్లతో పాటు కొన్ని సజావుగా ఉన్న వాటికి కూడా ఆన్‌లైన్‌లో చూపించకపోవడం, ఫీజులు తీసుకోకపోవడం, అన్ని చేసినా.. ప్రొసీడింగ్ రాక ఇబ్బందిపడి చివరకు వెనుతిరిగి వెళ్లినవారు కూడా ఉన్నారు. కాగా గడువు ముగియడంతో మరోసారి అవకాశం ఇవ్వాలని, ఎల్‌ఆర్‌ఎస్ కొత్త దరఖాస్తులు తీసుకునే వెసులుబాటు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. అయితే ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలని.. తమ చేతుల్లో ఏమీ లేదని అధికారులు అంటున్నారు.

ఐదు మున్సిపాలిటీల్లోని ఎల్‌ఆర్‌ఎస్ వివరాలు

మున్సిపాలిటీ	అర్హత పొందిన దరఖాస్తులు	ఫీజు చెల్లించినవి	మిగిలినవి
మహబూబాబాద్	9,268	2, 533	6,735
తొర్రూరు	6,181	967	5,214
మరిపెడ	1,228	333	895
డోర్నకల్	873	185	688
కేసముద్రం	942	67	875
మొత్తం	18,492	4,085	14,407

ముందస్తు ప్రణాళిక

- బడులు తెరిచేనాటికి దుస్తులు అందజేసేలా చర్యలు
- ఇప్పటి నుంచే విద్యాశాఖ అధికారుల కసరత్తు
- స్టేట్ యూనిట్‌గా క్లాత్ కొనుగోలు
- స్కూల్ యూనిట్‌గా సరఫరా

దుస్తులు అందజేసే విద్యార్థుల వివరాలు

అన్ని రకాల పాఠశాలలు: 1017
బాలురు: 21,021
బాలికలు: 21,877
మొత్తం: 42,898
అందించే దుస్తుల జతలు : 85,796

సాక్షి, మహబూబాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏటా రెండు జతల ఏకరూప దుస్తులు అందిస్తున్నారు. ఈమేరకు వచ్చే విద్యాసంవత్సరం తొలిరోజు పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు దుస్తులు అందించేందుకు ఇప్పటి నుంచే విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. గత అనుభవాల నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యార్థుల సైజుకు అనుగుణంగా కుట్టించి.. జూన్ ఒకటో తేదీ వరకు పాఠశాలలకు సరఫరా చేసేలా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశారు.

42,898 మందికి రెండు జతలు..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలతోపాటు కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, ట్రైబల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠశాలలు 1,017 ఉన్నాయి. ఇందులో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే బాలబాలికలు, ఎంపీహెచ్‌డబ్ల్యూ బాలికలు ఉన్నారు. 21,021మంది బాలురు, 21,877మంది బాలికలు.. మొత్తం 42,898 మంది విద్యార్థులు ఉన్నారు. కాగా ప్రతీ విద్యార్థికి రెండు జతల ఏకరూప దుస్తులు సరఫరా చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులు రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదిక అందించారు.

పాఠశాలలకు చేరుతున్న క్లాత్..

జిల్లా విద్యాశాఖ అధికారి రాష్ట్ర అధికారుకు నివేదించిన లెక్క ప్రకారం తరగతుల వారీగా బాలబాలికలకు రెండు జతలకు సరిపడా క్లాత్ పాఠశాల యూనిట్‌గా సరఫరా మొదలైంది. రాష్ట్ర యూనిట్‌గా టెండర్ ప్రక్రియ ద్వారా క్లాత్ సరఫరాకు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం పాఠశాల విద్యార్థుల సంఖ్య ఆధారంగా క్లాత్‌ను ప్యాకింగ్ చేసి సరఫరా చేస్తున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించి కుట్టించాలి. ఇందుకోసం జతకు రూ. 75 చొప్పున కుట్టు కూలీ ఇవ్వనున్నారు. ఈ ప్రక్రియ అంతా జూన్ ఒకటో తేదీ వరకు పూర్తి చేసి పాఠశాలలకు చేర్చాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో ఇప్పటి నుంచే జిల్లా అధికారులు అప్రమత్తం అవుతున్నారు.

గత అనుభవాల నేపథ్యంలో..

విద్యార్థులకు ప్రతీ ఏటా అందించే రెండు జతల ఏకరూప దుస్తులకోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా.. ఆ దుస్తులు విద్యార్థులు సంతృప్తి పడేలా ఉండడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు దుస్తులు అందించాలని ఉన్నతాధికారులు చెబుతున్నా.. ప్రతీ సంవత్సరం సగం పాఠశాలలకు అందడం లేదు. మూడు నెలలకొక జత, ఆరు నెలలకొక జత అన్నట్లు సరఫరా అయ్యాయి. అదేవిధంగా కొందరు అధికారులు కమీషన్లకు కక్కుర్తి పడి కుట్టరాని వారికి అప్పగించారనే విమర్శలు వచ్చాయి. దీంతో విద్యార్థి సైజ్‌తో సంబంధం లేకుండా కుట్టించి ఇచ్చేవారు. దీంతో తల్లిదండ్రులు ఏకరూప దుస్తులు వేయకుండా వేరే బట్టలు వేసి బడికి పంపించేవారు. అదేవిధంగా నాసిరకంగా కుట్టడంతో మూడు రోజులకే చినిగిపోయి ముక్కలుగా వేలాడుతూ కన్పించేవి.. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని పాఠశాలకు క్లాత్ ప్యాకెట్ వస్తే టైలర్లను పిలిచి పిల్లల సైజులు తీసుకొని కుట్టించాలని అధికారులు ఆదేశిస్తున్నారు.

సకాలంలో కుట్టించి ఇచ్చేలా చర్యలు



గత అనుభవాల నేపథ్యంలో ఈ సారి ముందస్తుగా దుస్తులు కుట్టించి ఇచ్చేందుకు ప్రణాళికతో వెళ్తున్నాం. వారం రోజుల్లో అన్ని పాఠశాలలకు క్లాత్ చేరుతుంది. హెచ్‌ఎంలు మహిళా సంఘాల్లోని కుట్టుపని వచ్చిన వారిని పిలిచి సైజులు తీసుకొని కుట్టించాలి. జూన్ ఒకటో తేదీ నాటికి వాటిని పాఠశాలలకు చేర్చాలి.

– రవీందర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

'గోరుబోలి' భాష గుర్తింపు చరిత్రాత్మకం

- ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్

మరిపెడ: కాంగ్రెస్ ప్రభుత్వం బంజారాల గోరుబోలి భాషను గుర్తించడం చరిత్రాత్మక నిర్ణయమని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. ఇటీవల అసెంబ్లీలో బంజారాల గోరుబోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఏకగ్రీవ తీర్మానం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం మరిపెడలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కల చిత్రపటాలకు రాంచంద్రునాయక్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షలు, దేశంలో 15 కోట్ల మంది బంజారాలు ఉన్నారని, గోరుబోలి భాషను గుర్తించడం ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. మానుకోట మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్, మండల అధ్యక్షుడు రఘువీరారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవి, నాయకులు వీసారపు శ్రీపాల్‌రెడ్డి, కొంపెల్లి సురేందర్‌రెడ్డి, గండి వీరభద్రం, లక్ష్మీనారాయణ, ఉపేందర్, కొండం దశరథ, బొడ్డు వెంకన్న, రవి, విజయ్, రవికాంత్, సురేశ్ ఉన్నారు.



సీఎం, డిప్యూటీ సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

క్లుప్తంగా

జోరుగా రిజిస్ట్రేషన్లు..

- రంజాన్ రోజున 134 పూర్తి
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 869 ఎల్ఆర్ఎస్‌లు..

కాజీపేట అర్బన్ : ఎల్ఆర్ఎస్ చెల్లింపులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 31వ తేదీ వరకు 25 శాతం రాయితీ కల్పించింది. ఈ అవకాశాన్ని భూక్రయవిక్రయదారులు సద్వినియోగం చేసుకునేందుకు సోమవారం రంజాన్ పండుగ రోజు కూడా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు తెరిచి ఉంచింది. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జోరు కొనసాగాయి. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 134 రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్నాయి. అదే విధంగా ఈనెల మొదటి వారం నుంచి 31వ తేదీ వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 869 ఎల్ఆర్ఎస్ చెల్లించిన దస్తావేజులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నాయి.

రంజాన్ రోజు రిజిస్ట్రేషన్లు ఇలా..
భీమదేవరపల్లి-10, భూపాలపల్లి-7, స్టేషన్ ఘన్‌పూర్-4, జనగామ-21, కొడకండ్ల-0, మహబూబాబాద్-16, ములుగు-16, నర్సంపేట-0, పరకాల-2, వర్ధన్నపేట-0, వరంగల్ రూరల్10, వరంగల్ ఆర్వో -31,వరంగల్ ఫోర్ట్-17.

ఎల్ఆర్ఎస్ దస్తావేజులు ఇలా...
భీమదేవరపల్లి-50, భూపాలపల్లి-59, స్టేషన్ ఘన్‌పూర్-13, జనగామ-226, కొడకండ్ల-5, మహబూబాబాద్-101, ములుగు-91, నర్సంపేట-23, పరకాల-3, వర్ధన్నపేట-1, వరంగల్ రూరల్-50, వరంగల్ ఆర్వో-137, వరంగల్ ఫోర్ట్-110.

కన్స్యూమర్ ఫీడ్ బ్యాక్ సెల్‌తో మరింత చేరువ

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



హన్మకొండ: విద్యుత్ వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు, నాణ్యమైన, మెరుగైన సేవలు అందించేందుకు కన్స్యూమర్ ఫీడ్ బ్యాక్ సెల్ ఏర్పాటు చేసినట్లు టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. ఈ సెల్ ద్వారా ఏప్రిల్ నెలలో వివిధ కేటగిరీల్లో రిలీజ్ చేసిన కొత్త సర్వీసుల లో ర్యాండమ్‌గా రోజుకు 60 మంది వినియోగదారులకు ఫోన్‌చేసి నాలుగు ప్యారా మీటర్లలో ఫీడ్ బ్యాక్ తీసుకుంటారని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. ఇలా ప్రతీ నెల దాదాపు 1,800 మంది వినియోగదారులతో మాట్లాడుతారన్నారు. నూతన సర్వీసులు సకాలంలో విడుదల, అధికారుల ప్రవర్తన, ఫిర్యాదుల పరిష్కారం, అవినీతిపై కన్స్యూమర్ సెల్ అధికారులు వివరాలు తెలుసుకుంటారని తెలిపారు. ఈ ప్యారా మీటర్ల ఆధారంగా సెక్షన్ ఆఫీసర్లు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులకు రేటింగ్ నిర్ణయించి అవార్డులు ప్రకటిస్తామన్నారు. ఈ కన్స్యూమర్ సర్వీస్ ఎక్సలెన్స్ అవార్డు ప్రతీ మూడు నెలలకోసారి వారు చేసిన ఉత్తమ సేవల ఆధారంగా అందించనున్నట్లు తెలిపారు. వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడానికి ఈ ఫీడ్ బ్యాక్ ఉపయోగపడుతుందన్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
హోల్‌సేల్ రేటు - 180/-
బ్రాయిలర్ చికెన్ రేటు - 230/-
స్కిన్‌లెస్ చికెన్ రేటు - 250/-
Cell: 9989299661

ముగిసిన 'కడవెండి'

మావోయిస్టు ప్రస్థానం

వివిధ ఎన్‌కౌంటర్లలో నేలరాలిన నలుగురు నక్సల్స్ వెంకటరమణ, సంతోశ్‌రెడ్డి, శ్రీను, రేణుక

- సీపీఐ(ఎంఎల్) నక్సల్స్ విస్తరణకు పునాదులు ఇక్కడే..
- మూగబోయిన విప్లవోద్యమాల పురిటి కెరటం
- ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో అసువులుబాసిన గుమ్ముడవెల్లి రేణుక
- కడవెండిలోనే రేణుకకు తుది వీడ్కోలుకు సన్నాహాలు
- ఆమె పుట్టిపెరిగిన ఇంటిని పరిశీలించిన పోలీసులు


గుమ్ముడవెల్లి రేణుక (ఫైల్)

దేవరుప్పుల : భూమి కోసం.. భుక్తి కోసం.. బానిసబంధాల విముక్తి కోసం కొనసాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పురిటిగడ్డ కడవెండి. ఇక్కడి నుంచే తుపాకీతోనే సమ సమాజ స్థాపన అంటూ అడవిబాట పట్టిన అగ్రనేతల ప్రస్థానం తాజాగా ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అసువులుబాసిన రేణుకతో ముగిసినట్లయ్యింది. నాలుగున్నర దశాబ్దాల క్రితం వామపక్ష భావాజాల పార్టీల సిద్ధాంతాలను విభేదించి సీపీఐ(ఎంఎల్) ఏర్పడిన నేపథ్యంలో అనతికాలంలో జనశక్తి, పీపుల్స్‌వార్ గ్రూపులుగా వీడిన క్రమంలో కడవెండి ఇరువురి పోరాటాల్లో కీలక భూమిక పోషించింది. ఈ తరుణంలో కడవెండి పడమటితోట నివాసిత భూ పంపిణీ పోరాట నేపథ్యంలో పీపుల్స్‌వార్ గ్రూపు విస్తరణ పైచేయిగా మారింది. ఈ పోరాటాన్ని వేదికగా చేసుకుని అన్నదమ్ములు ఎర్రంరెడ్డి పురుషోత్తంరెడ్డి, సంతోశ్‌రెడ్డి ఉన్నతంగా చదివి ఉన్నత ఉద్యోగాలు వచ్చే క్రమంలో సమ సమాజ స్థాపన ధ్యేయంగా పీపుల్స్‌వార్ గ్రూప్‌నకు అంకితమయ్యారు. వీరి నాయకత్వాన ఈ ప్రాంతం నక్సల్స్‌కు పెట్టని కోటగా మారే క్రమంలో ఇదే గ్రామానికి చెందిన పైండ్ల వెంకటరమణ 1986లో నర్సంపేట పీపుల్స్‌వార్ ఆర్గనైజర్‌గా పనిచేస్తూ నాచినపల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సీఐ అశోక్‌ను హతం చేసి తాను అసువులు బాశాడు. జీవీకే ప్రసాద్ అలియాస్ ఉసెండి , ఈయన సోదరి గుమ్ముడవెల్లి రేణుక సైతం పార్టీలో చేరారు. 1999లో కరీంనగర్ కొయ్యూరు ఎన్‌కౌంటర్ పేరిట అప్పటి ఉమ్మడి రాష్ట్ర పీపుల్స్‌వార్ కార్యదర్శి ఎర్రంరెడ్డి సంతోశ్ రెడ్డి అలియాస్ మహేశ్, ఆ తర్వాత ఇదే గ్రామానికి చెందిన పెద్ది శ్రీను నెక్కొండ ఏరియా దళసభ్యుడి హోదాలో ఎన్‌కౌంటర్ అయ్యారు. సంతోశ్‌రెడ్డి ఎన్‌కౌంటర్‌కు ముందే అతడి అన్న పురుషోత్తంరెడ్డి దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ స్థాయిలో పనిచేసే క్రమంలో అనారోగ్య కారణాలతో పోలీసుల ఎదుట లొంగిపోయారు. పదేళ్ల క్రితం జీవీకే ప్రసాద్ అనారోగ్యంతో లొంగిపోయాడు. ఇలాంటి అగ్రనేతలను స్ఫూర్తిగా తీసుకుని అడవి బాట పట్టిన రేణుక తాజా ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు.


కడవెండిలో మావోయిస్టు అగ్రనేతలు సంతోశ్‌రెడ్డి, వెంకటరమణ స్మారక స్తూపాలు


గ్రామానికి చెందిన మావోయిస్టులు సంతోశ్‌రెడ్డి, వెంకటరమణ, పెద్ది శ్రీను (ఫైల్)

మూగబోయిన కడవెండి..
ఇక్కడే రేణుక అంత్యక్రియలకు సన్నాహాలు


రేణుక పుట్టిపెరిగిన ఇంటి వద్ద గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

రజాకార్ల నుంచి అడవి బిడ్డల సమస్యల సాధన కోసం ఉద్భవించిన పోరాటాల్లో కీలక భూమిక పోషించిన నేతలు నేలరాలడంతో నేడు కడవెండి మూగపోయింది. చివరి నక్సల్స్ నేతగా ప్రజాక్షేత్రంలో తిరిగిన రేణుకకు అంతిమ వీడ్కోలు చెప్పేందుకు ఇక్కడ ఇల్లు లేకున్నా పుట్టిపెరిగిన పెద్దనాన్న (పాత ఇంట్లో) గృహం వద్ద నుంచే అంత్యక్రియలు జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రేణుక మృతదేహాన్ని తీసుకురావడానికి కుటుంబ సభ్యులు దంతెవాడకు బయలుదేరారు. ఉద్యమాలకు నిలయమైన కడవెండి వేదికగా రేణుకకు వీడ్కోలు పలికేందుకు తీవ్ర విషాదంలో గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు.

రేణుక అంత్యక్రియలపై పోలీసుల ఆరా..

దండకారణ్య స్పెషల్‌జోనల్ కమిటీ సభ్యురాలు రేణుక మృతదేహాన్ని స్వగ్రామం కడవెండికి తీసుకువస్తారన్న సమాచారం మేరకు స్థానిక ఎస్సై సృజన్‌కుమార్ ఆమె పెద్దనాన్న ఇంటికి చేరుకొని వివరాలు ఆరా తీశారు.

అరుణతారలో మెరిసిన 'మిడ్కో'


అరుణతార పుస్తకం

దేవరుప్పుల: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పురిటిగడ్డ ప్రభావం.. కాలానుగుణంగా ఉద్భవించిన నక్సల్స్ ఉద్యమ ప్రభావం.. వెరసి నివురుగప్పిన నిప్పులా ఉండే మావోయిస్టు కీలక మహిళా నేత గుమ్ముడవెల్లి రేణుక 25ఏళ్ల కిందట మావోయుస్టు అనుబంధ అరుణతార పుస్తకంలో తన రచనలతో మిడ్కోగా మెరిసింది. గోండి భాషలో 'మిడ్కో' అంటే 'మిణుగురు పూవు'. అంతటి అందమైన పేరుతో ఆమె రాసిన విప్లవ కథల్లో ప్రత్యేక శైలి ఉండేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలుగు నేలన అనేక ప్రాంతాల్లో మహిళా ఉద్యమ నిర్మాణంలో పనిచేసింది. విప్లవోద్యమంలోకి పూర్తికాలం కార్యకర్తగా వెళ్తూ ఆచరణాత్మకంగా మహిళా దృక్పథం నుంచి అద్భుతమైన కథలు రాసింది. ఆమె రాసిన 'మెట్లమీద' కథ తెలుగు కథా సాహిత్యంలో చర్చనీయాంశమైంది. ఆమె కథల్ని విరసం 2007లో 'మెట్లమీద' పేరుతో పుస్తకం ప్రచురించింది. ఇంతటి సాహితీవేత్త 'మిడ్కో' ఇవాళ దండకారణ్యంలో పోలీసుల కాల్పుల్లో చనిపోవడం.. సాహితీవ్యవస్థ అంధకారంగా మారిందని సామాజిక వేత్తలు, మేధావులు, కవులు, రచయితలు అభిప్రాయపడ్డారు.

గుమ్ముడవెల్లి రేణుక విప్లవోద్యమ ప్రస్థానం..

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి లోని పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన గుమ్ముడవెల్లి సోమయ్య, జయమ్మ(విజయ) దంపతులకు ముగ్గురు సంతానం. ఇందులో మొదటి కుమారుడు జీవీకే ప్రసాద్ మావోయిస్టుల్లో చేరి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ప్రస్తుతం ఢిల్లీ బీబీసీలో జర్నలిస్టుగా కొనసాగుతున్నారు. మరో కుమారుడు రాజశేఖర్ న్యాయవ్యాది. ఓ సంస్థకు లీగల్ అడ్వయిజర్‌గా వ్యవహరిస్తున్నారు. రెండో సంతానం గుమ్ముడవెల్లి రేణుక ప్రాథమిక విద్య కడవెండిలో చదువుతున్న క్రమంలో అన్న జీవీకే ప్రసాద్ మావోయిస్టు పార్టీలో చేరడంతో పోలీసుల నిర్బంధం పెరిగింది. దీంతో కుటుంబంతోసహా ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా మొత్కూరులో స్థిరపడ్డారు. ఈ క్రమంలో దేవరుప్పులలో పదో తరగతి చదివిన రేణుక.. ఇంటర్ జనగామ, డిగ్రీ ఉస్మానియా దూరవిద్యలో పూర్తి చేసింది. అనంతరం జనగామకు చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిగిన కొద్ది రోజులకే విడాకులు పొందారు. ఈ సంఘర్షణతోనే తిరుపతి పద్మావతి కళాశాలలో 'లా' చదివింది. ఈ క్రమంలోనే పీపుల్స్‌వార్ అనుబంధ ప్రజాసంఘాల్లో లీనమైన ఆమె.. తిరుపతి అలిపిరిలో అప్పటి సీఎం చంద్రబాబుపై దాడి ఘటన అనంతరం పార్టీలో కీలకంగా నిమగ్నమైంది. ఇదే క్రమంలో కడవెండికి చెందిన అప్పటి పీపుల్స్‌వార్ రాష్ట్ర కార్యదర్శి ఎర్రంరెడ్డి సంతోశ్‌రెడ్డి అలియాస్ మహేశ్‌తో పార్టీలో వివాహం జరిగింది. అయితే 1999లో కొయ్యూరు ఎన్‌కౌంటర్‌లో మహేశ్ చనిపోవడంతో వయసు రీత్యా తిరిగి పీపుల్స్‌వార్ నేత శాఖమూరి అప్పారావుతో సహచరిగా వ్యవహరిస్తూ లీగల్‌గా పార్టీకి కీలకంగా పనిచేసే క్రమంలో ఆయన సైతం ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. దీంతో రేణుక పార్టీలో పనిచేస్తున్న విషయం వెలుగులోకి రావడంతో వీరి తల్లిదండ్రులు హైదరాబాద్‌కు మకాం మార్చారు. శాఖమూరి అప్పారావు మృతి తర్వాత రేణుకను ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించారు. నాటి నుంచి మావోయిస్టు అనుబంధ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలిగా రేణుక అలియాస్ చైతు అలియాస్ సరస్వతిగా పలు ప్రాంతాల్లో పని చేస్తుంది. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ ప్రాంతంలో రేణుక ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో మృతదేహాన్ని తీసుకురావడానికి వారు బయలు దేరారు.


స్నేహితురాలితో రేణుక (ఫైల్)

రేణుకను విగత జీవిగా చూడాల్సి వస్తుందనుకోలేదు



పద్మశాలి వంశపారంపర్య చేనేత వృత్తి చేసుకునే మా కుటుంబంలో మా తమ్ముడు సోమయ్య ఉపాధ్యాయుడయ్యాడని సంతోషం పడేవారం. మా తమ్ముడు కొడుకు జీవీకే ప్రసాద్ చురుకైన వాడు. కానీ రేణుక నివురుగప్పిన మాదిరి నక్సల్స్ ఉద్యమంలోకి వెళ్లింది. ఈ రోజు విగత జీవిగా వస్తున్న మా కూతురును వృద్ధులమైన మేము చూడాల్సి వస్తుందని అనుకోలేదు. ప్రభుత్వం ఎన్‌కౌంటర్లు ఆపాలి.

-గుమ్ముడవెల్లి లక్ష్మీనర్సు,చంద్రమ్మ, కడవెండి (రేణుక పెద్దనాన్న, పెద్దమ్మ)

2004 తరువాత కుటుంబంతో సంబంధాలు లేవు



మా సోదరి తిరుపతి, ఆ తరువాత వైజాగ్ ఉండేది. 2004 తరువాత మా కుటుంబంతో సంబంధాలు తెగిపోయాయి. ఎన్‌కౌంటర్ వార్త తెలిసేంత వరకు మాకు ఆమెతో సంబంధాలు లేవు. పదేళ్ల క్రితం వరకు ఉత్తరాలు రాసేది. ఆ తర్వాత అవి కూడా బంద్ అయిపోయాయి. ఎన్‌కౌంటర్ వార్త కూడా సోషల్‌మీడియా ద్వారా మధ్యాహ్నం తెలిసింది. మేము బయలుదేరి దంతెవాడ వెళ్తున్నాం. మంగళవారం కానీ, బుధవారం కానీ కడవెండిలో అంత్యక్రియలు నిర్వహిస్తాం.

- రాజశేఖర్, రేణుక సోదరుడు

రేణుక మావోయిస్టు పార్టీలోకి పోయిందంటే విస్మయం చెందాం



మేము ఏడో తరగతి చదువుకున్న రోజుల్లో ఆ తర్వాత అప్పుడప్పుడూ కలిసిన క్రమంలో నిమ్మదస్తురాలిగా ఉండే రేణుక మావోయిస్టు పార్టీలోకి పోయిందంటే విస్మయం చెందాం. యాభై ఐదు ఏళ్లలో ఎక్కడో మహిళ నేతగా ప్రజల కోసం చనిపోవడం ఓ వైపు ఆనందంగా ఉంది. మరో వైపు అక్కడి ప్రభుత్వం మహిళ అని చూడకుండా ఎన్‌కౌంటర్ చేయడం బాధాకరం.

-పంతం సుజాత, రేణుక క్లాస్‌మేట్ కడవెండి

ప్రజాపోరాటాలపై పాలకులు యుద్ధం ఆపాలి



దేశంలో జరుగుతున్న ప్రజాపోరాటాలపై పాలకవర్గాల యుద్ధం ఆపాలి. ఆదివాసీ ప్రజల బాగు కోసం ప్రామాణిక రచనలు చేస్తూ ప్రజాసమస్యల సాధన కోసం పాటుపడిన న్యాయవాది, మావోయిస్టు నేత రేణుక నేలరాలడంపై ప్రభుత్వాలు వాస్తవిక దృక్పథంతో అధ్యయనం చేయాలి. మావోయిస్టులతో బేషరతుగా చర్చలు జరిపి శాంతి వాతావరణం నెలకొల్పాలి.

-అస్నాల శ్రీనివాస్, దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ ప్రతినిధి, కడవెండి

సఖి చెంతకు తల్లీబిడ్డ..

- అక్కున చేర్చుకుని భర్తకు అప్పగించిన వరంగల్ సఖ కేంద్రం
- కృతజ్ఞతలు తెలిపిన సందీప్

ఖిలా వరంగల్: మతిస్థిమితం కోల్పోయి నర్సంపేటలో రోడ్డుపై తిరుగుతున్న మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ తల్లీబిడ్డను వరంగల్ సఖీ కేంద్రం అక్కున చేర్చుకుంది. వారిని క్షేమంగా భర్తకు అప్పగించింది. వివరాలిలా ఉన్నాయి. గత నెల 28న నర్సంపేటలో రెండు నెలల పాపతో ఓ మహిళ రోడ్డపై తిరుగుతుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు తల్లీబిడ్డను వరంగల్ సఖి కేంద్రానికి అప్పగించారు. ఇక్కడ ఆశ్రయం పొందే సమయాన సదరు మహిళ పారిపోయే ప్రయత్నం చేసింది. అయితే కేంద్ర ఆదరణతో సదరు మహిళ తనది మధ్యప్రదేశ్ అని, తన పేరు గౌరీ అని, తదితర వివరాలు చెప్పింది. ఆ వివరాల ఆధారంగా భర్త సందీప్‌ను పిలిపించి అతడికి తల్లీబిడ్డను అప్పగించి సోమవారం మధ్యప్రదేశ్‌కు పంపించామని సఖి కేంద్రం నిర్వాహకురాలు శ్రీలత తెలిపారు. కాగా, తన భార్య రెండు నెలల చిన్నారిని తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయి పదిరోజులు అవుతుందని సందీప్ తెలిపారు. ఈ సమయంలో పలుచోట్లు వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లీబిడ్డ చనిపోయారని ఆందోళన చెందామని కన్నీరు పెట్టుకున్నారు. ఈ క్రమంలో తన భార్య, పాపను చేరదీసి అప్పగించిన సఖీ కేంద్రానికి సందీప్ కృతజ్ఞతలు తెలిపారు.



తల్లీబిడ్డను సందీప్‌కు అప్పగిస్తున్న సఖి కేంద్రం నిర్వాహకురాలు శ్రీలత

బ్యాంకుకు టోకరా

- బంగారు పూత నగలు కుదువపెట్టి రుణం

వరంగల్ క్రైం: బంగారు పూత నగలు కుదువ పెట్టి రుణం తీసుకొని బ్యాంకుకు టోకరా వేశాడు ఓ వ్యక్తి. సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి కథనం ప్రకారం హనుమకొండ నక్కలగుట్టలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో ఎన్‌జీఓస్ కాలనీకి చెందిన సతీశ్‌రెడ్డి కొద్ది రోజుల క్రితం బంగారు పూత పూసిన నగలను కుదువబెట్టి సుమారు రూ.9.55 లక్షల రుణం తీసుకున్నాడు. అనుమానం వచ్చిన బ్యాంకు అధికారులు వాటిని పరిశీలించారు. సతీశ్‌రెడ్డి కుదువపెట్టిన బంగారు నగల్లో 30 శాతం బంగారం, 70 శాతం ఇతర లోహంతో తయారు చేసి ఉన్నట్లు గుర్తించి బ్యాంకు అధికారులు సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సతీశ్‌రెడ్డిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు. ఇటీవల వరంగల్ నగరంలో బంగారు నగలపై రుణాలు ఇచ్చే సంస్థలో కూడా ఇలా జరిగిందని తెలిసింది.

2 తులాల బంగారు ఆభరణాలు చోరీ

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంటిలో నుంచి దుండగులు సుమారు రెండు తులాల బంగారు ఆభరణాలను సోమవారం రాత్రి అపహరించుకెళ్లారు. బాధితురాలు ఎస్తేరా కథనం ప్రకారం .. ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా కూతురు ఇంటికి వెళ్లింది. ఈక్రమంలో దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అలాగే, పక్కనే ఉన్న వెంకట రమణకు చెందిన ద్విచక్ర వాహనాన్ని అపహరించుకెళ్లారు. ఘటన స్థలానికి కాజీపేట పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలి

- ఎస్ఐఓ కార్యకర్తల డిమాండ్
- ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిరసన
- మద్దతు తెలిపిన మంత్రి కొండా సురేఖ

న్యూశాయంపేట : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వెంటనే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్ఐఓ) కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ పరిధిలోని మౌలానా అబ్దుల్ అజీజ్ ఈద్గా చింతల్, ఈద్గా ఖిలావరంగల్, ఈద్గా మట్టెవాడ, లష్కర్ సింగారం, హనుమకొండ, ఘనీఅబ్దుల్ అజీజ్ ఎల్‌బీనగర్ వరంగల్‌లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. రంజాన్ (ఈద్-ఉల్ ఫితర్) నమాజ్ అనంతరం ఎస్ఐఓ కార్యకర్తలు ప్ల కార్డులు చేతబూని నిరసన వ్యక్తం చేశారు. సవరణ బిల్లు ఆమోదం పొందితే వక్ఫ్ ఆస్తుల భద్రతకు ముప్పు వాటిల్లి సమాజ హక్కులు దెబ్బతింటాయన్నారు. కాగా, నిరసనకు రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ముస్లిం సంఘాల నాయకులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


ఖిలావరంగల్ ఈద్గా వద్ద నిరసన తెలుపుతున్న కార్యకర్తలకు మద్దతు తెలుపుతున్న మంత్రి, మేయర్

చిచ్చుపెట్టిన సిగరెట్ పొగ..

- జాతరలో యువకుల ఘర్షణ
- తీవ్రగాయాలతో యువకుడు బన్ని మృతి
- కుంటపల్లిలో విషాదం

సంగెం: జాతరలో సిగరెట్ పొగ పెట్టిన చిచ్చు ఒకరి ప్రాణం తీసింది. ఈ ఘటన వరంగల్ జిల్లా సంగెం మండలంలో గవిచర్లలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గవిచర్లలో ఏటా ఉగాది పర్వదినం సందర్భంగా గుండబ్రహ్మయ్య జాతర వైభవంగా జరుగుతుంది. ఈ జాతరకు మండలంలోని కుంటపల్లి గ్రామానికి చెందిన చిర్ర బన్ని(21), తల్లి పూల, సోదరి పూజిత, అన్న ధని అలియాస్ శివ, స్నేహితుడు గిరిబాబుతో కలిసి వచ్చారు. దర్శనం అనంతరం సోదరుడు ధని, తల్లి పూల, సోదరి పూజిత ఇంటికి వెళ్లిపోయారు. బన్ని, గిరిబాబు జాతరలో ఉన్నారు. రాత్రి 11.30 గంటల సమయంలో బన్ని స్నేహితుడు గుండేటి చందు.. ధనికి ఫోన్ చేసి కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు బన్నిని బెదిరిస్తున్నారని సమాచారం ఇచ్చాడు. వెంటనే ధని గవిచర్లకు చేరుకుని విచారించాడు. దేవాలయానికి కొద్ది దూరంలో బన్ని సిగరెట్ తాగుతుండగా గవిచర్లకు చెందిన వెల్పుల సిద్ధు కాస్త దూరంగా వెళ్లి తాగమన్నాడు. ఈ విషయంలో మాటామాటా పెరిగి ఇరువురు ఘర్షణ పడ్డారు. ఈ లోగా సిద్ధు అన్న వినయ్.. బన్నితో మాట్లాడి తన సోదరుడు సిద్ధు తప్పుచేశాడని అంగీకరించి అతడి తరఫున క్షమాపణ చెప్పాడు. తర్వాత జాతరలో కొంత సమయం ఉన్నారు. సిద్ధు జరిగిన వాదన గురించి కక్ష పెంచుకున్నాడు. అంతటితో ఆగకుండా సంగెం మండల కేంద్రానికి చెందిన తన మేనమామ గుండేటి సునీల్‌కు ఫోన్‌లో జరిగిన విషయం చెప్పడంతో 12.15లకు ఆటోలో సునీల్‌తోపాటు గుండేటి రాజు, కార్తీక్ అలియాస్ కర్రి, మహేందర్ అలియాస్ దోని, మెట్టుపల్లి భరత్, ఎం. భరత్, గుండేటి రాజ్‌కుమార్, గుండేటి కొమ్మాలు హుటాహుటిన జాతర ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికి సద్దుమణిగిన గొడవ సంగెం నుంచి వచ్చిన 8 మందితో మరింత ఎక్కువ అయ్యింది. తన అల్లుడు సిద్ధను ఎందుకు తిట్టారని, ఈ రోజు చంపుతామని బన్నిని కొట్టారు. దీంతో ధని.. బన్ని స్నేహితులతో కలిసి బన్ని రక్షించడానికి యత్నించాడు. ఈలోగా సునీల్ మిగతా వారితో కలిసి బన్నిపై దాడిచేసి పరారయ్యారు. ఈ దాడిలో బన్ని మెడ నరాలకు తీవ్రంగా గాయమై స్పృహ తప్పిపడిపోయాడు. గమనించిన స్థానికులు ముందు ఫిట్స్ అని చేతులు కాళ్లు మర్దన చేశారు. గమనించిన కానిస్టేబుల్ గుండెపోటు అని సీపీఆర్ చేశారు. అనంతరం 108లో ఎంజీఎం తరలించగా వైద్యులు పరీక్షించి బన్ని మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు ధని అలియాస్ శివ ఫిర్యాదు మేరకు నిందితులు 9మందిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పర్వతగిరి సీఐ రాజగోపాల్ తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, బన్ని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం సోమవారం కుంటపల్లికి తరలించారు. సంగెం, ఐనవోలు ఎస్సైలు నరేశ్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసి బన్ని అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా, బన్ని డిగ్రీ మొదటి సంవత్సరం చదువుకుంటూనే ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నాడు. బన్ని తండ్రి రాజు పది సంవత్సరాల క్రితం మృతి చెందాడు.


బన్ని (ఫైల్)

ట్రాక్టర్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

- సముద్రాలలో ఘటన
- పండుగపూట విషాదం

స్టేషన్‌ఘన్‌పూర్: పండుగపూట విషాదం నెలకొంది. ట్రాక్టర్ కొనివ్వలేదనే కారణంతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి మండలంలోని సముద్రాల గ్రామంలో జరిగింది. సీఐ జి.వేణు కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన బోదాసి బోసుకుమార్, లక్ష్మి దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ దంపతుల పెద్ద కుమారుడు సంతోశ్(21) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ కొనిస్తే నడుపుకుంటూ బతుకుతానని తల్లిదండ్రులను అడిగాడు. అందుకు తల్లిదండ్రులు స్పందిస్తూ ప్రస్తుతం డబ్బులు లేవని, కొన్ని రోజుల తర్వాత చూద్దామని చెప్పడంతో వాగ్వాదం జరిగింది. దీంతో కోపోద్రెకుడైన సంతోశ్ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. అనంతరం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లోకి వెళ్లిన కొడుకు ఎంతకూ తలుపులు తీయకపోవడంతో తల్లిదండ్రులకు అనుమానం వచ్చింది. వెంటనే పక్కింటి వారి సహకారంతో తలుపులు తొలగించి లోపలికి వెళ్లి చూడగా సంతోశ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి బోసుకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణు తెలిపారు.


సంతోశ్ (ఫైల్)

టోల్‌గేట్ చార్జీల్లో మార్పులు

- సోమవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి..

కురవి: కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులపై ఏర్పాటు చేసిన టోల్‌గేట్ల వద్ద సోమవారం అర్ధరాత్రి నుంచి చార్జీలను మార్పులు చేసింది. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం చింతపల్లి టోల్‌ప్లాజా మీదుగా రాకపోకలు సాగించే వివిధ వాహనాల ధరల్లో మార్పులు ఇలా ఉన్నాయి. కారు, జీప్, వ్యాన్, లైట్ మోటర్ వెహికల్ సింగిల్ జర్నీకి రుసుం రూ.45, ఒక రోజు లోపు తిరుగు ప్రయాణానికి రూ. 65 నుంచి రూ.70కి పెరిగింది. నాన్‌స్టాపింగ్ వెహికల్ పెనాల్టీ వర్తిస్తుంది రూ.90 నుంచి రూ.25, లైట్ కమర్షియల్ వెహికల్ లేదా గుడ్ వెహికల్ లేదా మినీ బస్సు రుసుం రూ.70 ఉండగా కొత్తది రూ.75 పెంచారు. బస్సు, ట్రక్ వాహనాలకు రుసుం రూ.150 ఉంది. ఇందులో పెరుగలేదు. మూడు యాక్సిల్ వాణిజ్య వాహనాలు రుసుం రూ.165 ఉంది. ఇందులో పెరుగలేదు. హెవీ వాహనాలకు రుసుం రూ.240 ఉంది. భారీ వాహనాలకు రుసుం రూ.290 ఉంది. ఇందులో పెరుగలేదు.

జవహర్‌నగర్ టోల్‌గేట్‌లో..
వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం మండలం జవహర్‌నగర్ టోల్‌గేట్‌లో గతంలో కారుకు అప్ అండ్ డౌన్ రూ.60 ఉండగా ప్రస్తుతం రూ.70, డీసీఎంకు రూ.130 ఉండగా రూ.145, బస్సుకు రూ.165 ఉండగా రూ.180. లారీకి రూ.310 ఉండగా రూ.330 పెరిగినట్లు టోల్‌గేట్ సిబ్బంది తెలిపారు. అయితే సిస్టంలో ధరలు అప్‌లోడ్ కాలేదని, అధికారికంగా ఇంకా ఫైనల్ కాలేదన్నారు.


కురవి: సీరోలు మండలం చింతపల్లి టోల్ ప్లాజా

ముత్తోజిపేట టోల్‌గేట్‌లో..
నర్సంపేట: ముత్తోజిపేట టోల్‌గేట్ వద్ద అధికారులు ధరలు స్వల్పంగా పెంచారు. కారు, జీప్, చిన్న మోటారు వాహనాల చార్జీలు యథావిధిగా ఉండగా, భారీ వాహనాలకు మాత్రం రూ. 5 చార్జీ పెంచారు. భారీ వాహనాలకు రూ. 10 పెంచారు. 365 హైవేపై 33కిలో మీటర్ల పరిధిలో ఈ చార్జీలు వసూలు చేస్తున్నట్లు సోమవారం సాయంత్రం వెల్లడించిన సర్క్యూలర్‌లో అధికారులు పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

అమ్మబడును
■ అమ్మబడును. దామెర మండలం, ఒగ్లాపూర్ గ్రామంలో ఉన్న దేశవాళి గొర్లు, పొట్టేళ్ళ మంద అమ్మబడను. సుమారుగా 170 గొర్లు చిన్న పెద్ద కలిపి ఉంటాయి. సెల్: 90302 41156 [MW 12938]

BUSINESS OFFER
■ శ్రీగోల్డ్ బైయర్స్ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9010190666. [SCA25002404]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/-
అదనపు లైను రూ॥ 60/- మాత్రమే
5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.